క్లుప్తంగా

నేడు యాదమరిలో జాతర

యాదమరి: మండల కేంద్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నేడు గంగ జాతరను నిర్వహించనున్నారు. ఆల య ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. మంగళవారం ఉదయం 5:30 గంటల నుంచి 6:30 గంటల్లోపు భక్తులకు అమ్మవారి విశ్వరూప దర్శనాన్ని కల్పించనున్నారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మరునాడు ఓంశక్తి భక్తులు అమ్మవారు నిమజ్జన కార్యక్రమంలో పలు విన్యాసాలు చేయనున్నారు. జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నిర్వాహకులకు స్థానిక ఎస్ఐ ఈశ్వర్ సూచించారు. గత కొన్నేళ్లుగా గంగ జాతరలో యువత గొడవలకు దిగుతున్నారు. అమ్మవారి నిమజ్జనం రోజున ఆధిపత్య పోరు కొనసాగుతుంది. దీనిని నివారించడానికి ఎస్ఐ ఈశ్వర్ తగిన ప్రణాళికలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే రౌడీ షీట్ తెరుస్తామని హెచ్చరించారు. ఇప్పటికే పది మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కిశోరి వికాసంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య కార్యకర్త

బంగారుపాళెం: యుక్తవయసులో ఉన్న బాలికల భవిష్యత్‌కు కిశోరి వికాసం దోహదపడుతుందని ఎంఎల్‌హెచ్‌పి ఢిల్లీ అన్నారు. మండలంలోని తగ్గువారిపల్లెలో సోమవారం కిశోరి బాలికలకు అవగాహన కల్పించారు. బాలికల్లో కౌమార దశలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలను, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. లైంగిక వేధింపుల నుంచి రక్షణ, ఆత్మరక్షణ, వృత్తి, విద్య, ఉపాధి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

యాదమరి: ప్రతి మహిళా స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ఆయన సోమవారం స్థానిక జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణలో మహిళలకు కుట్టు మిషన్లపై శిక్షణ తరగతులను డ్వామా పీడీ శ్రీదేవితో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎంపికైన ప్రతి మహిళా ఈ శిక్షణ తరగతులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్థికంగా ఎదుగుదలకే కాకుండా ఎంతో మందికి జీవనోపాధి కలిగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, ఎస్ఐ ఈశ్వర్ , ఏపీఎం ఈశ్వరి, ఈఓపీఆర్డీ సుకుమార్ రెడ్డి, మండల అధ్యక్షులు మొరార్జీ యాదవ్, నాయకులు అమర్నాథ్ నాయుడు, వెంకటేష్ రబీ, నాగరాజు పాల్గొన్నారు.

మా గ్రామానికి దారి ఇవ్వండి

చిత్తూరు రూరల్(కాణిపాకం): మా గ్రామానికి దారి ఇవ్వండి అంటూ పెనుమూరు మండలం సామిరెడ్డిపల్లె వాసులు విజ్ఞప్తి చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి అవసరమయ్యే రోడ్డు కోసం రామచంద్రనాయుడు కొంత భూమిని ఇచ్చారని చెప్పారు. పసుపు కుంకుమ కింద భూమిని సొంతం చేసుకున్న ఉష, సుజన తొలుత దారికి భూమి ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఇవ్వలేమని చెబుతున్నారని పేర్కొన్నారు. రోడ్డుకు కొంత భూమి ఇవ్వాలని భూ యజమానులను ప్రాధేయపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో సతీష్, వెంకటేష్, రవి తదితరులున్నారు.

అలరించిన హరికథ

గుడిపాల: మండలంలోని వసంతాపురం గ్రామంలో జరుగుతున్న మహాభారత యజ్ఞం, హరికథాగానం ప్రేక్షకులను అలరిస్తోంది. ఏప్రిల్ 30వ తేదీ నుంచి ప్రారంభమైన మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం హరికథా భాగవతార్ వినయ్‌ప్రసాద్‌రెడ్డి చెప్పిన బకాసురుడు, హిడింబి హరికథ పలువురిని ఆకట్టుకుంది. బుధవారం ద్రౌపదీ సమేత ధర్మరాజుల కల్యాణం ఉంటుందని ఆయన తెలియజేశారు. గురువారం రాత్రి నుంచి వెంకటేశ్వర కళా నాట్య మండలిచే తెలుగు వీధి నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.



హరికథా గానం ఆలపిస్తున్న భాగవతార్

విరబూసిన బంతి

గుడిపాల మండలంలో రైతులు ప్రస్తుతం బంతిపూల సాగుపై మక్కువ చూపుతున్నారు. అదీ మామిడిలో అంతరపంటగా బంతిని సాగు చేయడం విశేషం. మండలంలోని పాపసముద్రం, పిళ్లారికుప్పం, అడవిచేను, బండపల్లె గ్రామాల్లో రైతన్నలు బంతిపూలను సాగు చేస్తున్నారు. పిళ్లారికుప్పంలో విరగబూసిన బంతి పూలు చూపరులను కట్టిపడేస్తున్నాయి.

- గుడిపాల



'నేను చాలా పవర్‌ఫుల్'

చిత్తూరు అర్బన్: '' గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తిని పక్కనపెట్టి కొందరు అధికారాన్ని చెలాయించారు కానీ చిత్తూరులో ఇప్పుడు ఆ పరిస్థితి లేదు నేను డమ్మీ ఎమ్మెల్యే కాదు చాలా పవర్ ఫుల్'' అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని టీడీపీలో తానే కీలకమని మిగిలిన వాళ్ల ప్రమేయం ఏమీ ఉండదని స్పష్టం చేశారు. దీంతో ఎమ్మెల్యే పక్కనే కూర్చున్న సీనియర్ నేతల ముఖ కవళికలు మారిపోయాయి. ఇటీవల పలు పత్రికల్లో కట్టమంచి చెరువు పూడిక పనుల్లో అవినీతి చోటు చేసుకుందంటూ కథనాలు వెలుపడ్డాయి. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ కండలేరు నీటిని చిత్తూరుకు తీసుకువచ్చి చెరువులో నింపడానికి పూడికలు తీస్తున్నామని దీనికోసం కలెక్టర్ సైతం నిధులు మంజూరు చేశారన్నారు. కలెక్టర్ అనుమతితోనే తవ్వకాలు జరుపుతున్నట్లు తెలిపారు. ఇక కట్టమంచి చెరువులో తాము పనులు చేయబోమని వైఎస్సార్‌సీపీ నాయకులు ఇక్కడ స్వచ్ఛందంగా పనులు చేయచ్చని అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీస్తానని పేర్కొన్నారు. ఇక చెరువులో ఎవరైనా మట్టి తీసుకోవచ్చని పేర్కొన్నారు. పాత బస్టాండులో కాంప్లెక్స్ భవనం నిర్మించి తీరుతామన్నారు. హైరోడ్డు విస్తరణలో భాగంగా టీడీఆర్ బాండ్లు ఇచ్చేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో చూడా చైర్‌పర్సన్ హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నాయకులు చంద్రప్రకాష్, వసంత కుమార్, సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రి యాప్‌లపై విస్తృత అవగాహన

ఐరాల: వ్యవసాయ శాఖకు సంబంధించిన యాప్‌లపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఏఓ వరలక్ష్మి సూచించారు. మండలంలోని వేదగిరివారిపల్లె రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు మాస్టర్ ట్రైనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్కిల్ అప్ చిత్తూరు డిజిటల్ ట్రైనింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు స్మార్ట్ ఫోన్లు ఎలా వినియోగించుకోవాలి, ఫోన్ల వలన కలిగే నష్టాలు, లాభాల గురించి వివరించారు. వ్యవసాయ సమాచారం కోసం అగ్రిసెంట్రల్ ప్లాంటిక్స్, ఎన్‌సీఎస్‌ఎస్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 30 మంది రైతులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. శిక్షణ పొందిన రైతులు శిక్షణకు హాజరుకాని రైతులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. శిక్షణలో ప్రతిభ కనబరచిన ముగ్గురు రైతులకు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.12 వేలు, తృతీయ బహుమతి రూ.8 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంసా పత్రం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందచేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈఓ ద్రాక్షాయని, రైతులు పాల్గొన్నారు.



గుడిపాల: బుక్‌లెట్లను చూపుతున్న అధికారులు, రైతులు

ఆధునిక సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలి

ఐరాల: రైతులు పంటల సాగులో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని మండల పర్యవేక్షక అధికారి రజనీకుమారి సూచించారు. మండలంలోని ముదిగోళం రైతు సేవా కేంద్రంలో సోమవారం స్థానిక రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ పంట సాగులో స్మార్ట్ ఫోన్ ద్వారా పంట సాగుకు తోడ్పాటునిచ్చే వివిధ రకాల యాప్‌ల గురించి ఆచరణాత్మకంగా వివరించారు. రైతులు తమ స్మార్ట్ ఫోన్ ద్వారా నూతన పంటల సాగు విధానాలు, చీడ పీడలు గుర్తించడం, సలహాలు, వాతావరణ పరిస్థితులు, ప్రభుత్వ పథకాల సమాచారం, మార్కెటింగ్ సమాచారం, సదుపాయాలను ఆధునిక సాంకేతికత ద్వారా తెలుసుకుని అధిక ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ హేమంత్, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

సాగులో పరిజ్ఞానం అవసరం

గుడిపాల: పంటలు సాగుచేసే రైతులు పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఉమ అన్నారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో సోమవారం స్కిల్ ఆఫ్ చిత్తూరు- డిజిటల్ శిక్షణా కార్యక్రమాన్ని రైతులకు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు స్మార్ట్ ఫోన్ల వినియోగంతో పాటు, వ్యవసాయ సమాచారం తెలుసుకునే విషయంపై వారికి విపులంగా వివరించారు. ఎప్పటికప్పుడు స్మార్ట్ ఫోన్ల ద్వారానే రైతులు సేవలను ఉపయోగించుకోవచ్చన్నారు. పంటల మద్దతు ధర, మార్కెటింగ్‌పై తెలియజేశారు. కార్యక్రమంలో సహాయకులు యోగప్రియ, రైతులు పాల్గొన్నారు.



బంగారుపాళెం: శిక్షణలో మాట్లాడుతున్న ఏడీఏ విజయశంకర్ రెడ్డి

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి

బంగారుపాళెం: రైతులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయశంకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని టేకుమందలో సోమవారం రైతులకు 'స్కిల్‌ఆఫ్ డిజిటల్'పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ, ఆధునిక పరిజ్ఞానం ద్వారా రైతులు సాగుకు అవసరమైన విషయాలను తెలుసుకునేందుకు అవకాశం ఉందన్నారు. స్మార్ట్ ఫోన్‌లో అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని చెప్పారు. గూగుల్ ద్వారా సెర్చ్ చేసి వాతావరణ వివరాలు, పంటలు సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు తెలుసుకునేందుకు అవకాశం ఉందన్నారు. పొలంలో దుక్కులు దున్నిన తరువాత విత్తనాలు విత్తుకోవ డం నుంచి ఎరువులు, పురుగులు మందులు ఎలా వినియోగించుకోవాలనే విషయాల నుంచి పంట కోతల వరకు తెలియజేశారు. వ్యవసాయానికి సంబంధించిన యాప్స్ అగ్రి సెంట్రల్ యాప్, ఎన్‌పిఎస్‌ఎస్, ప్లాంటిక్స్, వ్యవసాయ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని అన్ని విషయాలు తెలుసుకోవచ్చన్నారు. వ్యవసాయశాఖ తరఫున ఉన్నటువంటి యూ ట్యూబ్ చానల్ ద్వారా సాగుకు అవసరమైన విషయాలను తెలుసుకోవచ్చని చెప్పారు. పండించిన పంటలు మార్కెట్‌లో ఎంత ధరలు ఉన్నాయని తెలుసుకోవచ్చన్నారు. వ్యవసాయానికి సంబంధించిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో రిసో ర్స్ పర్సన్ యాస్మిన్, రైతు సేవా కేంద్రం వీఏఓ స్వాతి,ఎంపీఈఓ రాణిప్రమీళ, రైతులు పాల్గొన్నారు.



రైతులకు శిక్షణ ఇస్తున్న పర్యవేక్షణ అధికారి రజనీకుమారి



ఐరాల: రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

తాళం వేసిన ఇళ్లలో చోరీ

పూతలపట్టు (కాణిపాకం): పూతలపట్టు మండలం ఆదివారం అర్ధరాత్రి దొంగలు చొరబడ్డారు. తాళం వేసిన ఇళ్లల్లో చోరీ చేశారు. బైక్ పైకి వచ్చిన దొంగలు మండల కేంద్రంలోని చిన్నస్వామి నాయుడు, జయరామనాయుడి ఇంట్లో ఆభరణాలను ఎత్తుకెళ్లిపోయారు. సుమారు 250 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి చోరీ చేసినట్లు సీఐ కృష్ణమోహన్ పేర్కొన్నారు.

గ్రామీణులకు ఇంటి వద్దనే మెరుగైన వైద్యం



ఐరాల: పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల /గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఐరాల పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 65 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

గుడిపాల మండలం తిమ్మాపల్లెలో బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ రష్మిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోరి బాలికలకు రక్త పరీక్షలు చేశారు. 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, సరిత, సరళ, శివగామి, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.



గుడిపాల: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రష్మిత

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు





చిత్తూరు: పుస్తకాలను అందిస్తున్న దాతలు, ఐరాల: విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న రాజశేఖర్

చిత్తూరు కార్పొరేషన్ : గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని దాత భార్గవి అన్నారు. ఆమె తనవంతు సాయంగా సోమవారం జిల్లా గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు, వైట్‌బోర్డును వితరణగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానం సముపార్జించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాత చంద్రహాస్, డిప్యూటీ లైబ్రేరియన్ లలిత, రాజ్‌కుమార్, రిసోర్స్ పర్సన్లు జెన్నీఫర్, భార్గవి, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఐరాల: గ్రంథాలయాలు భవిష్యత్తు తరాలకు విజ్ఞాన కేంద్రాలని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, గణితం, చిత్రలేఖనం, భరత నాట్యం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ 30 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ప్రతి రోజు గ్రంథాలయంలోని పుస్తకాలను విద్యార్థులు చదువుకొని మేథోశక్తిని పెంపొందించుకోవచ్చన్నారు. విరామ సమయంలో విద్యార్థులకు శీతల పానీయాలు అందించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

13న తవణంపల్లె పోలీస్ స్టేషన్‌లో వాహనాల వేలం

తవణంపల్లె: మండలంలో పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 13వ తేదీన తవణంపల్లె పోలీస్ స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.క్రిష్ణకుమార్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 13 వ తేదీ ఉదయం 10 గంటలకు తవణంపల్లె పోలీస్ స్టేషన్‌లో నిర్ణయించిన రుసుం చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.


ధ్రువపత్రాలు సిద్ధమేనా?

- కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లకు ఇదే సమయం
- విద్యాసంస్థల్లో ప్రవేశాలు నేపథ్యంలో ముందస్తుగా సిద్ధం కావడం మేలు

గుడిపాల: పదో తరగతి, ఇంటర్మీడియెట్ తదితర పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. ఉన్నత చదువుల్లో భాగంగా కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులకు పలు ధ్రువపత్రాలు తప్పనిసరి. వీటని ముందస్తుగా పొందేందుకు ఇదే మంచి తరుణమని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో రానున్న విద్యార్థుల కోసం సంబంధిత కార్యాలయాల్లోనూ అవసరమైన అన్ని పత్రాలు అందజేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఒత్తిడి పెరగకముందే...

సాధారణంగా మే, జూన్ నెలల్లో ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయాల్లో సిబ్బందిపై ధ్రువపత్రాల జారీకి సంబంధించి అధిక ఒత్తిడి ఉంటుంది. దరఖాస్తుదారుల రద్దీ పెరుగుతుంటుంది. వీఆర్వో, ఆర్ఐ క్షేత్ర స్థాయి పరిశీలన, డిజిటల్ సంతకాలు తదితర పనులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కార్యాలయాలకు పలుమార్లు తిరగాల్సి రావడం, మధ్యవర్తులను ఆశ్రయించడం వంటి ఇబ్బందులు రావచ్చు. ఫలితంగా అనుకున్న సమయానికి ధ్రువపత్రాలు చేతికి అందకపోవచ్చు. ముందుగా మేల్కొంటే హైరానా తప్పుతుందని అధికారులు చెబుతున్నారు.



ధ్రువపత్రాలు పొందాలంటే...

- ప్రస్తుతం చదువుతున్న తరగతుల నుంచి తదుపరి తరగతుల్లో ప్రవేశానికి ఆదాయం, కులం, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ వంటి ధ్రువపత్రాలు తప్పనిసరి. వీటికోసం మీ-సేవా కేంద్రాలు, సచివాలయాల వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.
- ఆధార్, రేషన్‌కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలతో సంబంధిత అర్జీ పూర్తిచేసి అవసరమైన నకళ్లను జతపర్చి సచివాలయం డిజిటల్ సహాయకుడికి అందజేయాలి.
- ఆన్‌లైన్‌లో పొందుపరచిన వివరాలపై వీఆర్వో క్షేత్రస్థాయిలో, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ) నేరుగాను పరిశీలిస్తారు. అన్నీ పక్కాగా ఉంటే చివరిగా తహసీల్దార్ తన లాగిన్‌లో మరోసారి నిశితంగా పరిశీలించి డిజిటల్ సంతకం చేస్తారు. దీనిపై మొబైల్‌కు వచ్చే సందేశంతో దరఖాస్తుదారులు సచివాలయంలో గానీ, మీసేవా కేంద్రంలో గానీ ధ్రువపత్రాలు పొందవచ్చు.

దరఖాస్తు చేసుకోండి

కళాశాలలు, వృత్తి విద్యా కోర్సుల్లో చేరే సమయంలో అవసరమయ్యే ధ్రువపత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుంటే మేలు. చివరి సమయంలో హడావుడి పడుతూ ఆందోళన చెందకుండా ప్రస్తుత సెలవుల్లోనే కార్యాలయాలను సంప్రదించాలి. కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీకి నిర్దేశించిన సమయం కంటే ముందు వీటిని జారీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

- జయంతి, తహసీల్దార్, గుడిపాల



భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. దీంతో జనం బయట తిరగలేకపోతున్నారు. మధ్యాహ్న సమయంలో అయితే రోడ్డుపై ఒక్క వాహనం కూడా కనిపించడం లేదు. దానికి సాక్ష్యమే ఈ రోడ్డు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా కనిపించే చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి సోమవారం ఇలా నిర్మానుష్యంగా కనిపించింది.

- గుడిపాల